పశువైద్యం..దైవాధీనం

పశువైద్యంపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. పశువైద్యశాలల్లో మూగజీవాలకు వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు. పశు వైద్యసిబ్బంది కొరత తీవ్రం ఉంది. ఒకే వైద్యుడు రెండు, మూడు ఆస్పత్రులకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జి బాధ్యతలు ఉన్న చోటుకు సక్రమంగా వైద్యులు వెళ్లడం లేదు. దీంతో వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్రలు, అటెండర్లపైనే పాడిరైతులు ఆధారపడుతున్న పరిస్థితి నెలకొంది. వారు తోచిన వైద్యం చేసి పశువుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మంగళవారం ఉదయగిరి, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల్లోని పశువైద్యశాలలను 'సాక్షి' పరిశీలించగా పలు అంశాలు వెలుగు చూశాయి.

వేధిస్తున్న వైద్య సిబ్బంది కొరత

- ఒక్కో వైద్యుడికి రెండు, మూడు ఆస్పత్రుల బాధ్యతలు
- వెటర్నరీ అసిస్టెంట్లతో అరకొరగా సేవలు

సాక్షి విజిట్

పశువైద్య సిబ్బంది పోస్టులు ఖాళీ



శిథిలావస్థకు చేరిన దుత్తలూరులోని ఏరియా పశు వైద్యశాల

దుత్తలూరు: మండలంలో పశువైద్యసిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దుత్తలూరులో ఏరియా పశువైద్యశాల, నందిపాడు, నర్రవాడలో పశు వైద్యశాలలు ఉన్నాయి. మండలంలో ఆవులు 300, గేదెలు 10,881, మేకలు, గొర్రెలు 41,896, కోళ్లు 8వేలు ఉన్నాయి. నందిపాడులోని జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ డిప్యూటేషన్‌పై ఇతర జిల్లాకు వెళ్లాడు. అలాగే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టు సైతం ఖాళీగా ఉంది. నర్రవాడలో పశువైద్యుడు లేకపోవడంతో కొండాపురంలో పనిచేసే పశువైద్యుడు రోజు మార్చి రోజు విధులకు హాజరవుతున్నాడు. వీఏఎస్ పోస్ట్ సైతం ఖాళీగా ఉంది. దుత్తలూరు ఏరియా వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో సిబ్బంది ఇబ్బంది పడడమే కాకుండా మందులు పాడవుతున్నాయి.

రెండేళ్లుగా డాక్టర్ పోస్టు ఖాళీ


విధులు నిర్వహిస్తున్న వీఏ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం పశువైద్యశాలలో రెండేళ్ల నుంచి రెగ్యులర్ వైద్యులు లేరు. సీతారామపురం పశువైద్యశాలకు చెందిన వైద్యురాలిని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. ఆమె కూడా గత కొంతకాలంగా సెలవులో ఉన్నారు. ఈ మధ్యనే విధుల్లో చేరారు. రెండు చోట్ల విధులు నిర్వహించడం కష్టంగా మారింది. దీంతో పాడిరైతులకు వెటర్నరీ అసిస్టెంటే(వీఏ) దిక్కవుతున్నాడు. ఆస్పత్రిలో సబార్డినేట్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. దీంతో వీఏ క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు వైద్యశాలకు తాళం వేయాల్సి వస్తోంది. రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో పశుపోషకులు కూడా వైద్యశాలకు రావడం తగ్గించారు. వైద్యశాలలో మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం కూడా ఇబ్బందిగా మారింది. కూటమి ప్రభుత్వంలో పశువైద్యులను నియమించకపోడంతో పశు వైద్యం అందని ద్రాక్షగా మారిందని రైతులు వాపోతున్నారు.

గోపాలమిత్రే దిక్కు


వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న గోపాలమిత్ర

సీతారామపురం: సీతారామపురంలోని పశువైద్యశాలలో గోపాలమిత్ర ఒక్కడే విధుల్లో ఉన్నాడు. వైద్యాధికారిణి విధులకు హాజరుకాలేదు. గండిపాళెం పశువైద్యశాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నందున అక్కడకు వెళ్లారని గోపాలమిత్ర తెలిపారు. మరొక సిబ్బంది మెడికల్ లీవులో ఉండగా, అటెండర్‌ను జేడీ ఆఫీసుకు సరెండర్ చేశారని, మరొకరు సమీపంలోని కుర్రపల్లి పశువైద్యశాల వద్దకు పశువుల పంచనామాకు హాజరైనట్లు చెప్పారు. పశువైద్యశాలలోమందుల కొరత లేదు.

కనిపించని వైద్యులు


మహిమలూరులో మందులు అందజేస్తున్న ఆఫీస్ సబార్డినేట్

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు, వాశిలి, మహిమలూరులో పశువైద్యశాలలు ఉన్నాయి. వాశిలి పశువైద్యశాలకు సంగం వైద్యాధికారి సురేష్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఆయన ఆస్పత్రికి రాలేదు. కరటంపాడు డాక్టర్ కృష్ణయ్య సెలవులో ఉన్న కారణంగా పశువైద్య సహాయకుడు రోషన్ అందుబాటులో ఉన్నారు. మహిమలూరులో పనిచేస్తున్న జేఈఓ సుబ్బారావు పై అధికారులు పిలిచారనే కారణంతో ఆస్పత్రికి రాలేదు. దీంతో ఆఫీస్ సబార్డినేట్ నాగిరెడ్డే పాడిరైతులకు మందులు అందజేశారు.

పాముకాటుకు మందులు లేవు


కలిగిరి: సిద్దనకొండూరులో వైద్యం చేస్తున్న డాక్టర్ వీరహరిన్

కలిగిరి: మండలంలో కలిగిరిలో ప్రాంతీయ పశువైద్యశాల, సిద్దనకొండూరు, పెద్దకొండూరు గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. వైద్యులు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఆస్పత్రుల్లో గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన మందులే అందుబాటులో ఉన్నాయి. అయితే పాముకాటు, విషపురుగు కాటుకు సంబంధించిన మందులు మాత్రం అందుబాటులో లేవు.

పదేళ్లుగా రెగ్యులర్ వైద్యులు లేరు


అనంతసాగరంలో కుక్కకు వైద్యం చేస్తున్న సహాయకులు

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరు, అనంతసాగరం, చిలకలమర్రిలో పశువైద్యశాలలు ఉన్నాయి. గత పదేళ్లుగా రెగ్యులర్ వైద్యులు లేరు. ఆత్మకూరు మండలం కరటంపాడు పశువైద్యశాల డాక్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఎప్పుడు వస్తారో..ఎప్పుడు పోతారో తెలియడం లేదని పాడి రైతులు చెప్పారు. అందుకే పశువులను ఆస్పత్రికి తీసుకురావడమే మానేశామని, వెటర్నరీ అసిస్టెంట్లు అందజేసే మందులు తీసుకువెళ్తున్నామని వాపోయారు. ప్రభుత్వ వైద్యులు లేక ప్రైవేట్ కాంపౌండర్లకు వేలకు వేలు ఖర్చు చేసి పశువులకు వైద్యం చేయించుకోవాల్సి వస్తోందని వాపోయారు.

యాంటిబయాటిక్స్ లేవు

సంగం: మండలంలో సంగం, మర్రిపాడులో పశువైద్యశాలలు ఉన్నాయి. పశువైద్యశాలల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారు. కానీ పశువైద్యశాలల్లో యాంటిబయాటిక్, పెయిన్‌కిల్లర్ మందులు మాత్రం కొరతగా ఉన్నాయి.


రెగ్యులర్ వైద్యులు లేని వరికుంటపాడు పశువైద్య శాల

వెటర్నరీ సర్జన్, వైద్యుడి పోస్టులు ఖాళీ

వరికుంటపాడు: మండలంలో వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లె గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. పెద్దిరెడ్డిపల్లె పశువైద్యశాలలో రెగ్యులర్ డాక్టర్ ఉండగా, వరికుంటపాడులో వైద్యాధికారి, వెటర్నరీ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెద్దిరెడ్డిపల్లె పశువైద్యాధికారి నందిపాడు, వరికుంటపాడు పశువైద్యశాలలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో పాడిరైతులకు పూర్తిస్థాయిలో పశువైద్య సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది.

గ్రంథాలయ భవనంలోనే సేవలు



అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని ప్రధాన పశువైద్యశాలకు సొంత భవనం లేదు. గ్రంథాలయ భవనంలోని చిన్నగదిలో మందులను ఏర్పాటు చేసుకుని పశువైద్యసిబ్బంది సేవలు అందజేస్తున్నారు. గ్రంథాలయ భవనం సైతం వర్షం పడితే ఉరుస్తుండడంతో మందులు తడిసిపోతున్నాయి. నిత్యం ఆస్పత్రికి ఎంతో మంది రైతులు తమ పశువులను చికిత్స నిమిత్తం తీసుకొస్తుంటారు. పశువైద్యశాలకు భవనం, తగిన వసతులు లేకపోవడంతో పాడిరైతులతో పాటు వైద్యసిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.


గేదెకు చికిత్స చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్లు

పూర్తిస్థాయిలో అందని సేవలు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలలో ఏడీ ఎస్ జయచంద్రతో పాటు ముగ్గురు సిబ్బంది ఉన్నారు. వైద్యాధికారి కుమారుడికి రోడ్డు ప్రమాదం జరగడంతో ఆయన మంగళవారం సెలవులో ఉన్నారు. దీంతో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ (కాంపౌండర్), మరో సహాయకుడు పశువులకు వైద్యసేవలు అందించారు. వారం క్రితమే స్టాక్ రావడంతో ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రాంతీయ వైద్యశాల పరిధిలోని ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల్లోని పశువైద్యశాలల్లో వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో లేని కారణంగా పశు వైద్యసేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయి.

సబ్‌సెంటర్లకు భవనాలు లేవు


కొమ్మిలో కూలిపోయిన వెటర్నరీ సబ్‌సెంటర్

కొండాపురం: మండలంలో సాయిపేట, కొండాపురంలో పశువైద్యశాలలు ఉన్నాయి. వాటి పరిధిలో కొమ్మి , గొట్టిగుండాల, గరిమెనపెంట పంచాయతీల్లో సబ్‌సెంటర్లు ఉండగా భవనాలు లేవు. గరిమెనపెంటలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గొట్టిగుండాలలో భవనం శిథిలావస్థకు చేరడంతో అంగన్‌వాడీ భవనంలో నిర్వహిస్తున్నారు. కొమ్మి సబ్‌సెంటర్ భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయింది. ఇక్కడ వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంటు పోస్టు ఖాళీగా ఉంది. గొట్టిగుండాలలో పనిచేసే అధికారిని ఇన్‌చార్జిగా నియమించడంతో సక్రమంగా సేవలు అందడం లేదు. సాయిపేట, కొండాపురం పశువైద్యశాలల్లో మందులు కొరత ఉంది.

క్లుప్తంగా

నేడు వెంగమాంబ సన్నిధిలో వేలం పాటలు

దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో వివిధ హక్కులకు సంబంధించి బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ మంగళవారం తెలిపారు. టెంకాయలు, పూజాద్రవ్యాలు విక్రయం, తలనీలాలు, కొబ్బరి చిప్పలు, అమ్మవారి చీరలు, రవికలు, ఎండు కొబ్బరి సేకరించుకునే హక్కులకు బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే పుష్పాలు, కూరగాయలు, పాలు, పెరుగు, అభిషేకం సామగ్రి, విద్యుత్ దీపాలు, ప్లంబింగ్ సామగ్రి, వస్త్రాలు, వంట చెరకు, గోశాలకు వరిగడ్డి సరఫరా చేయుటకు మధ్యాహ్నం 3 గంటలకు సీల్డ్ టెండర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

పోషకాహారం తీసుకోవాలి



కావలి: గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత సూచించారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ పథకం కింద గర్భిణులకు మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఐరన్, పోలిక్ సిరప్‌లు పంపిణీ చేశారు. వైద్యులు మేఘనాథ్‌చౌదరి, లక్ష్మి, డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కొండాపురం: ఇటీవల వెలిగండ్ల వద్ద ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో గరిమెనపెంటకు చెందిన దిల్‌కుషా అనే మహిళ మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మృతురాలి కుటుంబసభ్యులకు రూ. 25 వేలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ. 5 వేల వంతున నగదు సాయం అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, నాయకులు కర్తం శ్రీనివాసులరెడ్డి, వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, యారం వెంకటేశ్వర్లు, బొడ్డు మల్లికార్జున, జయపాల్‌రెడ్డి, డేగా మాధవ, రామిరెడ్డి కొండారెడ్డి, గున్నా ప్రసాద్, పీ కమలాకర్, వీరెళ్ల చంద్రయ్య, సంధాని ఉన్నారు.

మా పాఠశాలను విలీనం చేయొద్దు



సోమశిల: అనంతసాగరం మండలం మినగల్లు ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను వేరే పాఠశాలలో విలీనం చేస్తూ ఫౌండేషన్ పాఠశాలగా మారుస్తున్నారని తెలుసుకున్న తల్లిదండ్రులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మొద్దు శాంతి మాట్లాడుతూ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ పిల్లలే ఎక్కువగా చదువుతున్నారని తెలిపారు. 3, 4, 5 తరగతులను పిల్లలను వేరే పాఠశాలకు తరలిస్తే చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.

యునాని దినోత్సవం

ఆత్మకూరురూరల్: మహిమలూరు పీహెచ్‌సీలో జాతీయ యునాని దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత పీహెచ్‌సీ వైద్యాధికారులు దేవానంద్, అనూషా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనాని వైద్యసేవలపై డాక్టర్ ఎండీ అబ్దుల్‌రజాక్ అవగాహన కల్పించారు. యునాని వైద్య సిబ్బంది లక్ష్మీప్రసన్న, చలపతి పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు లైంగిక వేధింపులు, వాటి పర్యావసానాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ శ్రీవాణి, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు వీ శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఐ గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులు సమాజంలో జరుగుతున్న లైంగికదాడులు, సైబర్ నేరాలు, లైంగిక వేధింపులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆర్థిక సాయం

ఉదయగిరి: మండలంలోని గండిపాళేనికి చెందిన జీ వేణు సోమవారం ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు వైఎస్‌ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య రూ.10 వేలు, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య రూ.5 వేలు చొప్పున నగదును మంగళవారం అందజేశారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

15న వేమన శతక పద్య పోటీలు


కావలి: పట్టణంలోని కలయిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 15న విద్యార్థులకు వేమన శతక పద్యపోటీలను నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం కన్వీనర్లు జీ రాంప్రసాద్, ఇలీంద్ర లావణ్య, సలహాదారులు సీ శారద, సాయిరాం ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే ఉద్దేశంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 5,6,7 తరగతులు, 8,9 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు జరుపుతున్నట్లు చెప్పారు. ఈ నెల 18న యోగి వేమన జయంతి వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు 92904 45693, 92468 84073, 94407 57799 , 94941 46130, 98663 02517 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆట విడుపు అవసరం

కావలి: నిత్యం విద్యార్థులకు పాఠశాలను బోధించడంలో మునిగితేలే అధ్యాపకులకు ఆట విడుపు అవసరమని విశ్వోదయ విద్యా సంస్థల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల అధ్యాపకులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో సత్తా చాటిన జవహర్ భారతి కళాశాల అధ్యాపకులు సత్తాచాటారు. టెన్నిస్ సింగిల్స్‌లో పీడీ ప్రసాద్‌రెడ్డి, డబుల్స్‌లో ప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి (జంతుశాస్త్ర అధ్యాపకులు) విజేతలుగా నిలిచారు. అలాగే టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో పీడీ ప్రసాద్‌రెడ్డి రన్నర్‌గా, డబుల్స్‌లో ప్రసాద్‌రెడ్డి, కామర్స్ అధ్యాపకుడు ఎస్‌కే అయూబ్‌అహ్మద్ రన్నర్స్‌గా నిలిచారు. మహిళల త్రోబాల్ పోటీల్లో గణిత అధ్యాపకురాలు అశ్విని, ప్రత్యూష (జంతుశాస్త్ర అధ్యాపకులు) విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా అధ్యాపకులను దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం అభినందించి బహుమతులు అందజేశారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- బాలుడి మృతి
- మరో వ్యక్తికి తీవ్రగాయాలు


బాలుడి మృతదేహం

మర్రిపాడు: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో బాలుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన స్థానిక కస్తూర్బా విద్యాలయం ఎదురుగా ముంబై జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని నూతల గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి మర్రిపాడు సెంటర్‌లో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నాడు. అతని వద్ద సన్నువారిపల్లికి చెందిన సానా శివకుమార్‌రెడ్డి(16) పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే రాత్రి దుకాణంలోని చెత్తను కస్తూర్బా స్కూల్ సమీపంలో పడేసి తిరిగి వస్తుండగా బైక్‌ను బద్వేలు నుంచి నెల్లూరు వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో బాలుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సుబ్బారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. సుబ్బారెడ్డిని 108లో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. కారును నిలిపివేసి అందులోని ప్రయాణికులు పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగికదాడి యత్నం

కావలి : పట్టణానికి చెందిన 8 ఏళ్ల బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించి ఘటనపై ఒకటో పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఒకటో పట్టణ పరిధిలోని ఓ ఇంటి పైపోర్షన్‌లో ఓ కుటుంబం నివాసం ఉంటోంది. అదే ప్రాంతంలో చిన్నషాపును నడుపుకొంటూ జీవనం సాగిస్తోంది. సదరు కుటుంబానికి చెందిన 8 ఏళ్ల బాలిక ఇంటికి పోతుండగా, కింద పోర్షన్‌లో నివాసం ఉంటున్న రమేష్ అనే వ్యక్తి తన ఇంట్లోకి తీసుకెళ్లి తలుపేశాడు. ఇంట్లో నుంచి బాలిక కేకలు వినిపిస్తుండడంతో స్థానికులు, షాపులో ఉన్న బాలిక తల్లి ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇంటి బయట బాలిక చెప్పులను గమనించి తలుపులు తట్టడంతో రమేష్ తలుపులు తీశాడు. అత్యాచారయత్నానికి పాల్పడినట్లు బాలిక విలపిస్తూ తల్లికి చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఎం కరీమున్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు డిపో పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలు, ఫిర్యాదులను 99592 25645 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

వరి పంట నాశనం చేశారని ఫిర్యాదు

జలదంకి: తన పొలంలోని చేతికొచ్చిన వరి పంటను కొందరు నాశనం చేశారని కోదండరామపురం గ్రామానికి చెందిన పసుపులేటి నాగార్జున అనే రైతు జలదంకి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. తన రెండెకరాల్లో వరి పంటపై వేములపాడుకు చెందిన ఉప్పు రమణయ్య, వేముల సుధాకర్, ఉప్పు ఏడుకొండలు, ఉప్పు తిరుపతి గడ్డి మందు కొట్టి నాశనం చేశారని ఫిర్యాదు పేర్కొన్నారు. పోలీసులు విచారించి న్యాయం చేయాలని కోరారు.

నీట్ మెటీరియల్ పంపిణీ



కావలి: పట్టణంలోని జవహర్ భారతి జూనియర్ కళాశాలలో బైపీసీ చదువుతున్న పేద విద్యార్థులకు కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు నీట్ మెడికల్ ఎంట్రెన్స్‌కు సంబంధించిన రూ.25వేల విలువచేసే స్టడీ మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. డీఎం మాట్లాడుతూ తాను జేబీ కళాశాలలో చదివి ఆటో మొబైల్ ఇంజనీరింగ్ చేసి ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. తనకు విద్యాభిక్ష పెట్టిన విశ్వోదయ విద్యాసంస్థల రుణం తీర్చుకునేందుకు పేద విద్యార్థులకు తన వంతు సాయంగా స్టడీమెటీరియల్‌ను అందిస్తున్నానని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ ఎం శామ్యూల్‌రాజ్, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌కు రూ.1.50లక్షల విరాళం

కావలి: రెడ్‌క్రాస్ కావలి శాఖకు విశ్రాంత వైద్యారోగ్య శాఖ అధికారి, రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు సద్దా నారాయణరెడ్డి, తనూజారెడ్డి దంపతులు రూ.1.50లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, ఆర్డీఓ ఎం సన్నీవంశీకృష్ణకు మంగళవారం అందజేశారు. రెడ్‌క్రాస్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా దాతను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ కావలి రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న రక్త కేంద్రం, తలసేమియా డే కేర్ సెంటర్, మరణానంతర, విపత్తు నిర్వహణ సేవలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని తెలిపారు. త్వరలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు, కేన్సర్ నిరోధక వ్యాక్సిన్ కేంద్రాన్ని కావలి రోటరీ క్లబ్ సహకారంతో ప్రారంభించనున్నామని వివరించారు. రెడ్‌క్రాస్‌కు సహకారం అందజేస్తున్న దాతలను ఆయన అభినందించారు. దాత మాట్లాడుతూ తన సతీమణి తనూజరెడ్డి కోరిక మేరకు ఆమె సోదరి చిన్నపురెడ్డి భువనేశ్వరి జ్ఞాపకార్థంగా విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ నిర్వాహకులు డీ రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, కే హరినారపరెడ్డి, బీఎస్ ప్రసాద్, ఆక్వా వ్యాపారి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలకు న్యాయ సాయం

ఆత్మకూరు: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ప్రత్యేకావసరాల పిల్లలకు న్యాయం సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బీ గాయత్రి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలను అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ ఎస్‌కే అస్మాతో కలిసి మంగళవారం ఆమె సందర్శించారు. ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తించి వారి వివరాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపునకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రత్యేక బృందాలు ఇంటింటికి తిరిగి ప్రత్యేకావసరాల పిల్లలను నమోదు చేసి చట్టపరంగా అందే సౌకర్యాలు, న్యాయసేవలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. న్యాయ సహాయం కోసం లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నంబరు 15100, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ నంబరు 1098, దివ్యాంగ శాఖ హెల్ప్‌లైన్ నంబరు 14456ను సంప్రదించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చునని తెలిపారు.

ఉత్తర కాలువ పరిశీలన

ఆత్మకూరురూరల్: మండల పరిధిలో ఉత్తర కాలువను సోమశిల ప్రాజెక్ట్ నాల్గో డివిజన్ డీఈ మెట్టుకూరు మురళీకృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. కాలువలో నీటి ప్రవాహంతో పాటు ప్రజలకు అవసరమైన వంతెనలు, తదితర అంశాలపై క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాళ్లపాడు ప్రాజెక్ట్ వరకు ఉత్తర కాలువ ద్వారా సోమశిల జలాలు చేరాల్సి ఉందన్నారు. స్థానిక రైతులు ఇష్టానుసారంగా ఉత్తర కాలువ నీటిని చెరువులు, కాలువలకు వినియోగించడం సరికాదన్నారు. ఆయన వెంట ఏఈ పరమేశ్వరరెడ్డి, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.